సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం ၊ 28 ၊ జూలై ၊ 2023



పక్కా ప్రణాళికతోనే చోరీ

నార్కట్‌పల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి రూ.28 లక్షలు పక్కా ప్రణాళికతో చోరీ చేసినట్లు తెలుస్తోంది. - 8లో



యాదాద్రిని సందర్శించిన హై కమిషనర్

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ గురువారం యాదాద్రి కలెక్టరేట్‌ను సందర్శించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
28° / 24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడూ విద్యా సంస్థలకు సెలవు

భువనగిరి : వర్షాల కారణంగా శుక్రవారం కూడా విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు డీఈఓ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ నెల 26,27 తేదీల్లో సెలవులు ప్రకటించగా వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో శుక్రవారం వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29న మొహరం, 30న ఆదివారం కావడంతో విద్యా సంస్థలకు వరుసగా ఐదు రోజులు సెలవులు వచ్చాయి.

భగీరథ నీటి విషయంలో ఆందోళన వద్దు

భువనగిరి టౌన్ : మిషన్ భగీరథ నీటి విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, నిరభ్యంతరంగా గృహ అవసరాలకు వాడుకోవచ్చని మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్ లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు స్వల్పంగా రంగు మారడంతో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎల్లంపల్లి జలాశయానికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో గోదావరి జలాలు సాంద్రత పెరిగి స్వల్పంగా రంగు మారిందన్నారు. నదిలో వరదలు తగ్గుముఖం పట్టే వరకు పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని, ఆందోళన చెందకుండా అవసరాలకు వాడుకోవచ్చన్నారు. వేడి చేసి చల్లార్చి వడబోసిన అనంతరం తాగడానికి వినియోగించాలని కోరారు.

టీ9(30)సేవలు ప్రారంభం



టీ 9(30) టిక్కెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఈడీ

భువనగిరి : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ పల్లె వెలుగు బస్సుల్లో ప్రవేశపెట్టిన టీ 9(30) టికెట్ సేవలను గురువారం భువనగిరి బస్టాండ్‌లో ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వెలుగు బస్సుల్లో రూ.50కే 30 కిలో మీటర్ల పరిధిలో ఉదయం 9నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ –పాస్ టిక్కెట్ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాదగిరిగుట్ట డిపో మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ టీ 9(30) టిక్కెట్ విధానం ప్రవేశపెట్టిన మొదటి రోజే 250 టిక్కెట్లను ప్రయాణికులు కొనుగోలు చేశారని తెలిపారు.


నృసింహుడికి సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ఆలయ ముఖమండపం, ప్రాకార మండపాల్లో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

గ్రామాల్లో పర్యటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం



గోకారంలో వర్మి కంపోస్టు యార్డును సందర్శించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రతినిధులు

వలిగొండ,గుండాల : వలిగొండ మండలం గోకారం, ప్రొద్దటూరు గ్రామాల్లో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. పారిశుద్ధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లు, వాటి వినియోగం, టాయిలెట్లు, ఇంకుడుగుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఓ సునంద, డీఆర్డీఏ ఏపీడీ శ్యామల, ఎంపీడీఓ గీతారెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు. అదే విధంగా గుండాలలో బృందం పర్యటించింది. వారివెంట డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ పైళ్ల జనార్దన్‌రెడ్డి ఉన్నారు.



ఆలేరు శివారులో పరవళ్లు తొక్కుతున్న పెద్దవాగు

ముంచెత్తింది!

- బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఏకధాటిగా వర్షం
- సగటున 7.58 సెంటీ మీటర్ల వర్షపాతం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగుతున్న చెరువులు, వాగులు
- మూసీకి పోటెత్తిన వరద
- కాజ్‌వేలపై నుంచి ప్రవాహం
- రాకపోకలు నిలిపివేసిన అధికారులు

సాక్షి, యాదాద్రి : వాన వరదై పారింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలకు వరద పోటెత్తింది. చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. పలు చోట్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేయడంతో జనం రాతంత్రా జాగారం చేయాల్సి వచ్చింది. ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న వాగులు, మూసీ కాజ్‌వేల వద్ద రాకపోకలు నిలిపివేశారు. పంటలు నీట మునిగాయి.



భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో నీట మునిగిన ఇళ్లు, రోడ్డు

వర్ష నష్టం ఇలా..

- భువనగిరి పరిధిలోని రాయగిరి వద్ద జాతీయ రహదారిపై భారీ వర్షంపు నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామంలో ఇళ్లలోకి నీరు చేరింది.
- భువనగిరి మండలం అనాజిపురం చెరువు అలుగు పోస్తుండటంతో 50 ఎకరాల వరి పొలం నీట మునిగింది.
- భువనగిరి మండలం కూనూరు వద్ద రాయగిరి – మోత్కూర్ రహదారిపై భారీ వృక్షం కూలడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది.
- వలిగొండ మండల మల్లేపల్లి చెరువు కట్ట తెగిపోవడంతో నీరు వృథాగా పోతుంది. 30నుంచి 50 ఎకరాల వరకు పంటలు నీట మునిగాయి.
- వలిగొండ – మోత్కూరు రోడ్డుపై నుంచి వరద పోతుండడంతో రాకపోకలు ఆపేశారు.
- వలిగొండ, బీబీనగర్‌లో పలు చెరువులు, కాల్వలకు గండ్లు పడి పంటలు నీట మునిగాయి.
- తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్‌లోని పోశమ్మ చెరువుకు గండి పడింది.
- భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరులో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- యాదాద్రిలో గండిచెరువు నిండి పొంగి పొర్లుతుండడంతో పొలాలు నీట మునిగాయి.

కల్వర్టుల పైనుంచి వరద

వర్షానికి ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలో వాగులకు వరద పోటెత్తింది. ఆలేరు పెద్దవాగు, రత్నాల వాగు, పెద్ద మోరీ, గొలనుకొండ, కొలనుపాకతో పాటు ఆత్మకూర్(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాల పరిధిలో బిక్కేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బిక్కేరు పరీవాహకంలో పత్తి చేలలోకి నీరు చేరింది. బొమ్మలరామారం, భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో హైదరాబాద్, శామీర్‌పేట ప్రాంతం నుంచి వచ్చే చిన్నేటి వాగు ఉగ్ర రూపం దాల్చింది.

ఉధృతంగా మూసీ

హైదరాబాద్ జంటనగరాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. పోచంపల్లి, బీబీనగర్ మండలాల మధ్య జూలూరు– రుద్రవెల్లి, వలిగొండ మండలం భీమలింగం కత్వ, సంగెం – బొల్లేపల్లి గ్రామాలను కలిపే కల్వర్టుపై నుంచి మూసీ పరవళ్లు తొక్కుతోంది. ఆయా ప్రాంతాల వద్ద నుంచి రాకపోకలు నిలిపివేశారు. బారికేడ్లు, కంప మండల అడ్డంగా వేసి అధికారులు కాపలాకాస్తున్నారు.

మొత్తం చెరువులు, అలుగుపోస్తున్నవి

జిల్లాలో 1,080 చెరువులుండగా 132 అలుగుపోస్తున్నాయి. మరో 127 అలుగుపోయడానికి సిద్ధంగా ఉన్నాయి. 216 చెరువులు 75 శాతం, 361 చెరువులు 50 శాతం, 244 చెరువులు 25 శాతం వరకు నిండినట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

అడ్డగూడూరులో అత్యధిక వర్షం

జిల్లాలో సగటున 7.58 సెం. మీ వర్షం కురిసింది. అత్యధికంగా అడ్డగూడూరులో 108.6 మీ.మీ, గుండాల మండలంలో 108 మి.మీ వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నీట మునిగాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు నిర్మించడం, పక్కనే ఉన్న కుంటలు, కాల్వల నుంచి వరద ఇళ్ల మధ్య చేరింది. 40 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి, ఇటీవలే లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ ఇంకా పట్టాలు పంపిణీ చేయలేదు. వాటిలో ఎలా ఉండాలోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

మండలాల వారీగా వర్షపాతం

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
తుర్కపల్లి	98.2	బీబీనగర్	43.8
రాజాపేట	85.4	పోచంపల్లి	74.4
ఆలేరు	94.2	చౌటుప్పల్	28.4
మోటకొండూర్	64.0	నారాయణపురం	36.8
యాదగిరిగుట్ట	99.6	రామన్నపేట	64.4
భువనగిరి	74.2	వలిగొండ	68.6
బొమ్మలరామారం	63.2	ఆత్మకూర్	78.4
		అడ్డగూడూరు	108.6
		గుండాల	108.0

క్షేత్రస్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు

రాజపేట మండలం రఘునాథపురం పొట్టిమర్రివాగు, చల్లూరు, బేగంపేట, రేణిగుంట వాగులను గురువారం కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. వర్షాల కారణంగా చెరువులు, వాగులకు వరద పోటెత్తుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్లు 08685 –293312, 9121147135ను సంప్రదించాలన్నారు. అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాతబడిన ఇళ్లలో నివసించేవారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అవసరమైతే కమ్యూనిటీ హాళ్లు, గ్రామ చాయతీ భవనాలు, పాఠశాలలు ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ రవికుమార్, పోలీసు అధికారులు ఉన్నారు. అదే విధంగా అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, దీపక్ తివారీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వాగు, ఆలేరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, శారాజీపేట చెరువు, కొలనుపాక వాగు, మోత్కూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. చెరువులు, కుంటలు, వాగుల వద్ద పరిస్థితిని తెలుసుకున్నారు. బీబీనగర్ మండలం రాఘవాపురం వద్ద బునాదిగాని కాల్వకు పండిన గండికి రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మరమ్మతులు చేయించారు.



రాజాపేట మండలం బేగంపేట వద్ద వాగులో వరద పరిస్థితిపై సమీక్షిస్తున్న కలెక్టర్

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీసీపీ

భువనగిరి : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ రాజేశ్‌చంద్ర కోరారు. గురువారం భువనగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చాలా చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయన్నారు. లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్నందున దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌తో పాటు ఇతర చెరువుల గెట్లు తెరిచినందున మూసీ పరీవాహక ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. భువనగిరి జోన్‌లో 42 ప్రదేశాల్లో కాజ్‌వేల పైనుంచి వరద పారుతుండడంతో అక్కడ బారికేడ్లు ఏర్పాట్లు చేసి రాకపోకలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. చెరువుల్లో చేపలు పట్టడానికి, ఈతకు వెళ్లరాదని సూచించారు. ఆపద సమయంలో 100కి కాల్ చేయాలన్నారు. పాత ఇళ్లు కూలిపోయే అవకాశం ఉన్నందున అలాంటి వారు సమాచారం ఇస్తే శిబిరాల్లో వసతి కల్పిస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు తాకరాదని, చెట్ల కింద నిలబడవద్దని సూచించారు.

కల్యాణ కట్టలో లీకేజీలు



లీకేజీ నీరు బండలపై పడకుండా బకెట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

యాదగిరిగుట్ట : వర్షానికి యాదాద్రి కల్యాణకట్టలో లీకేజీలు ఏర్పడుతున్నాయి. స్లాబ్‌తో పాటు బీమ్‌లకు మధ్య పగుళ్లు రావడంతో అందులో నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతుంది. నీళ్లు బండలపై పడకుండా బకెట్లు ఏర్పాటు చేశారు. కల్యాణకట్టను ప్రారంభించిన ఏడాదిన్నరకే లీకేజీలు ఏర్పడటం నాణ్యతలో డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోంది.



రుద్రవెల్లి – జూలూరు మధ్య కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న మూసీ



వలిగొండ మండలం మల్లేపల్లి చెరువుకు గండి..



గుట్ట మండలం వంగపల్లిలో నీట మునిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

డిప్యూటీ కలెక్టర్లుగా తహసీల్దార్లు

- ఐదుగురికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు

భువనగిరి : కలెక్టరేట్ ఏఓ, నాలుగు మండలాల తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఏఓగా విధులు నిర్వహిస్తున్న నాగలక్ష్మి, భువనగిరి, ఆలేరు, రామన్నపేట, మోత్కూరు తహసీల్దార్లు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

డీపీఆర్‌ఓ బదిలీ

డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్‌రావు నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జిల్లా డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ యాదాద్రి భువనగిరి జిల్లా డీపీఆర్‌ఓగా రానున్నారు.

ప్రధాని మోదీ రైతు పక్షపాతి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

సాక్షి,యాదాద్రి : ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతు పక్షపాతి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రైతుల సంక్షేమం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల సందర్భంగా భువనగిరిలోని గంజ్ మార్కెట్‌లో జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. దేశంలో 8.5 కోట్ల మంది రైతులకు 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి కింద మొత్తం రూ.17వేల కోట్లు మోదీ సర్కార్ అందజేసిందన్నారు. అలాగే దేశంలోని రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చాలన్న ఉద్దేశంతో రూ.2236 సబ్సిడీ భరిస్తూ కేవలం రూ.267కే యూరియా బస్తా, రూ.2422 సబ్సిడీ భరిస్తూ రూ.1350కి డీఏపీ అందజేస్తుందన్నారు.

మోదీ సర్కార్‌కు అండగా నిలవాలి : పీవీ

కేంద్ర ప్రభుత్వం.. సబ్సిడీ భరిస్తూ తక్కువ ధరకు ఎరువులు, ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు కిసాన్ సమ్మాన్ పేరుతో ఏటా రూ. 6 వేల పెట్టుబడి సాయం అందజేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీలు నిలిపివేయడమే కాకాండా కేంద్రం ఇచ్చే సబ్సిడీతో కూడిన వ్యవసాయ పరికరాల స్కీంను అమలు కాకుండా అడ్డుకుంటుందని విమర్శించారు. ఓట్ల కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని, అది భూస్వాములు, పారిశ్రామిక వేతలకు దోచిపెట్టే స్కీం అని ఎద్దేవా చేశారు. రైతు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వడమే కాకుండా పండిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్న మోదీ సర్కార్‌కు అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో దేశంతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పోతంశెట్టి రవీందర్, దాసరి మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, మాయ దశరథ, ఉమాశంకర్, పట్నం శ్రీనివాస్, పిట్టల అశోక్, మె హమూద్, చిట్టిపోలు శ్రీధర్, ఏ.లక్ష్మణ్, వేణు మాధ వ్, వై.సంతోష్, నగేష్, వి.అశోక్ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న ప్రభాకర్, పీవీ శ్యామ్‌సుందర్‌రావు, నారాయణరెడ్డి

కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ రాజీనామా

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు కౌన్సిలర్ పచ్చర్ల హేమలతాజగన్‌మోహన్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం రాత్రి సోషల్ మీడియా ద్వారా తన రాజీనామా విషయాన్ని లేఖతో సహా వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ ఆశించినా ఇవ్వలేదన్నారు. అప్పట్లో డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేరదీసి టికెట్ ఇచ్చి తన గెలుపు కోసం సహకరించారని పేర్కొన్నారు. అనిల్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడినందున తాను కూడా కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు స్పష్టం చేశారు. మరికొందరు కూడా కాంగ్రెస్ పార్టీని వీడనున్నారని తెలిపారు.

యాదాద్రికి తగ్గిన భక్తులు


యాదగిరిగుట్ట : భారీ వర్షాల కారణంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఆలయానికి గురువారం భక్తుల రద్దీ తగ్గింది. కేవలం 15 నిమిషాల్లో దర్శనం అయినట్లు భక్తులు తెలిపారు. భక్తులు సంఖ్య తగ్గడతో క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల తదితర ఆలయ పరిసరాలు వెలవెలబోయాయి. నిత్యాదాయం రూ.10,87,675 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



భక్తులు లేక బోసిబోయిన ఆలయ తిరువీధులు

పాతగుట్ట స్వాగత తోరణం కూల్చివేత

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణం నుంచి శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న స్వాగత తోరణాన్ని దేవస్థానం, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. 1975లో నిర్మించిన ఈ స్వాగత తోరణం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని మున్సిపల్ యంత్రాంగం యాదాద్రి, వైటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వారు స్పందించి బుధవారం అర్ధరాత్రి రాకపోకలు లేని సమయంలో స్వాగత తోరణాన్ని కూల్చివేశారు. కాగా స్వాగత తోరణంపై భాగంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రతిమలను తీయకుండానే కూల్చివేయడంతో అవి ధ్వంసమయ్యాయి.



స్వాగత తోరణం శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

అత్యవసర సేవలనూ నిలిపివేస్తాం



కలెక్టరేట్ ఎదుట వర్షంలో ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

- ప్రభుత్వానికి పంచాయతీ కార్మికుల హెచ్చరిక

భువనగిరిటౌన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో అత్యవసర సేవలు కూడా నిలిపివేస్తామని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ వడ్డబోయిన వెంకటేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు ఏళ్ల తరబడిగా తక్కువ వేతనానికి వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నేటి వరకు శాంతియుతంగా సమ్మె కొనసాగిస్తామని, ప్రభుత్వం దిగిరాకపోతే విద్యుత్ దీపాలు, నీటి సరఫరా వంటి అత్యవసర సేవలను సైతం నిలిపివేస్తామన్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.60 జీఓ ప్రకారం కనీస వేతనం రూ. 19,600 చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ధర్నాలో గ్రామ పంచాయతీ కార్మికుల మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పొట్ట యద్దమ్మ, కార్మికులు మాయ కృష్ణ, గడ్డం ఈశ్వర్, బందెల భిక్షం, కొల్లూరి ఆంజనేయులు, మంచాల మధు, గాడి శ్రీనివాస్, మాంద్ర శీను, పాపయ్య, పాశం, బాలయ్య, యాదగిరి, రమేష్, యాదయ్య, యాదగిరి, ఎల్లయ్య, వెంకటయ్య, బాల మల్లయ్య, సోములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

మోతె: విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతిచెందిన ఘటన మోతె మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన ఇరిగి వెంకటేశ్వర్లు(30) గురువారం ఉదయం తన మేకలను ఇంటి నుంచి తోలుకొని వెళ్లి వ్యవసాయ క్షేత్రంలో మేపుతున్నాడు. ఈ సమయంలో మేకలకు మేత కోసం చెట్టు కొమ్మలు నరుకుతుండగా పక్కనే ఉన్న ఫెన్సింగ్‌కి తగలగా.. దానికి కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెబుతా

- బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్


గగన్‌మాలిక్‌కు మెమొంటో అందజేస్తున్న బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్: బుద్ధవనం తనను ఎంతగానో ఆకట్టుకుందని, బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పుతానని బాలీవుడ్ నటుడు, మాజీ క్రికెటర్ గగన్‌మాలిక్ అన్నారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించి, సన్మానించారు. సిద్దార్థ గౌతమ అనే చిత్రంలో నటించి ఉత్తమ నటుడిగా అవార్డు పొందడమే గాక, జీ టీవీ రామాయణం సీరియల్‌లోని రాముని పాత్రలో రాణించినట్లు తెలిపారు. బుద్ధవనంలోని జాతకవనం, ధ్యానవనం, శ్రీలంక బుద్ధవిగ్రహం, స్థూపవనం, మహాస్థూపం చుట్టూ అలంకరించిన బౌద్ధ శిల్పాల గురించి బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గగన్‌మాలిక్‌కు వివరించారు. బుద్ధవనంలో చిత్రాలు తీయడానికి బాలీవుడ్, టాలీవుడ్ నిర్మాతలతో చర్చిస్తానని గగన్‌మాలిక్ పేర్కొన్నారు. వారి వెంట కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్డీ సుధీర్‌రెడ్డి, డిజైన్ ఇంఛార్జి శ్యాంసుందర్‌రావు ఉన్నారు.

• వానలు.. వరదలు


యాదగిరిగుట్ట పట్టణంలోని గండి చెరువు నిండి యాదగిరిపల్లిలోని పొలాల్లోకి వెళ్తున్న వర్షం నీరు


గుండాల: అలుగు పోస్తున్న నూనెగూడెం పెద్ద చెరువు


మోటకొండూరు: అమ్మనబోలు-గొలనుకొండ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


నూతనకల్: గుండ్లసింగారం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న పాలేరు వాగు


మోత్కూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు


అర్వపల్లిలోని పోలీస్ స్టేషన్ రోడ్డులో జలమయమైన ఇళ్లు


అడ్డగూడూరు: గోవిందాపురం వద్ద వాగులో కొట్టుకుపోతున్న బైక్‌ను తీస్తున్న స్థానికులు


రాజాపేట: దూదివెంకటాపురం వద్ద కల్వర్టుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు


మోతె: కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


తిరుమలగిరి(తుంగతుర్తి): అనంతారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు


ఆత్మకూర్(ఎస్): నసీంపేట వద్ద వరద ధాటికి కోతకు గురైన తాత్కాలిక రోడ్డు


ఆత్మకూరు(ఎస్)లో శంభుని చెరువు అలుగు పోస్తుండడంతో చేపలు పడుతున్న గ్రామస్తులు


ఆలేరు పట్టణంలోని 11 వార్డులో నీట మునిగిన ఇళ్లు


భువనగిరి మండలం వడపర్తి కత్వ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాచకాల్వ

మూసీ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో


మూసీ ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

- ఎనిమిది గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం ఉదయానికి ప్రాజెక్టుకు 25,489 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరిగింది. అధికారులు ఎనిమిది క్రస్టు గేట్లను ఐదు అడుగుల మేర పైకెత్తి 25,207 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 282 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.89 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నగదు చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- రూ. 14 లక్షల నగదు, స్కూటీ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


నిందితుడు వెంకటేష్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి, బొమ్మలరామారం: కారులో పెట్టిన రూ.14లక్షలు దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర భువనగిరి పట్టణంలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన దొమ్మాటి శంకర్ బొమ్మలరామారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి వద్ద ఇదే మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన తుడుం వెంకటేష్ పనిచేస్తున్నాడు. వెంకటేష్ ప్రతిరోజు శంకర్ ఇంటికి వెళ్లి మధ్యాహ్నం భోజనం తీసుకువస్తుంటాడు. ఇటీవల శంకర్ తనకు సంబంధించిన 20 గుంటల భూమిని హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి విక్రయించాడు. భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి బుధవారం ఉదయం శంకర్‌కు రూ.14 లక్షలు నగదు తెచ్చి ఇచ్చాడు. నగదును తీసుకున్న శంకర్ కార్యాలయం ఆవరణలో ఉన్న తన కారు డిక్కీలో పెట్టి తాళం వేసుకున్నాడు. ఇదంతా గమనించిన వెంకటేష్ రోజుమాదిరిగా మధ్యాహ్నం భోజనం తీసుకురావడం కోసం శంకర్ ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో భోజనంతో పాటు ఇంట్లో ఉన్న కారు డూప్లికేట్ తాళాన్ని తీసుకొని కార్యాలయానికి వచ్చి భోజనాన్ని ఇచ్చాడు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఉన్న కారు వద్దకు వెళ్లి తన వెంట తెచ్చుకున్న డూప్లికేట్ తాళంతో కారు డిక్కీని ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 14లక్షల నగదును దొంగిలించి తన స్కూటీలో పెట్టుకుని అక్కడి నుంచి పారిపోయాడు. సాయంత్రం విధులు ముగించుకొని శంకర్ కారు వద్దకు వచ్చి చూడగా డిక్కీలో నగదు కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గురువారం రంగాపురం గ్రామ చౌరస్తా వద్ద వెంకటేష్‌ను పట్టుకొని విచారించగా తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద రూ.14లక్షల నగదుతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. 24 గంటల్లోనే ఈ కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌ఓ ఏఎస్పీ శివం ఉపాధ్యాయను డీసీపీ అభినందించారు. సమావేశంలో రూరల్ సీఐ బి. సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- వారం రోజుల్లో ఆస్ట్రేలియాకు.. ఇంతలోనే ప్రమాదం
- తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన మరో యువ డాక్టర్
- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం


సట్టు మహేష్ (ఫైల్)

నల్లగొండ క్రైం: మరో వారం రోజుల్లో ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఇదే ప్రమాదంలో మరో యువ డాక్టర్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. ఈ ఘటన బుధవారం రాత్రి నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సట్టు సైదులు, నాగమణి దంపతులు ఉద్యోగ రీత్యా నల్లగొండ పట్టణంలోని పద్మావతి కాలనీలో అద్దెకు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు సట్టు మహేష్(25) ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. మహేష్‌కు పట్టణంలోని బోయవాడకు చెందిన బత్తుల ముత్యాల్‌రావు కుమారుడు రాజు చిన్నప్పటి నుంచి స్నేహితుడు. రాజు చెన్నైలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. మహేష్, రాజు ఇద్దరూ కలిసి బుధవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై నల్లగొండ పట్టణ శివారులోని సాగర్ రోడ్డులో ఉంటున్న తమ స్నేహితుడి వద్దకు వెళ్లి రాత్రి 9గంటల సమయంలో తిరిగి నల్లగొండ పట్టణంలోకి వస్తున్నారు. అదే సమయంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టగా.. మహేష్ డివైడర్‌పై పడడంతో తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బైక్ నడుపుతున్న రాజు తలకు తీవ్రగాయాలు కాగా అతడు వెంటనే తేరుకొని రోడ్డు వెంట వచ్చే వాహనాలను ఆపుతుండగా.. వారి వెనకే వచ్చిన వాహనదారుడు రోడ్డు అడ్డంగా నిలబడి వాహనాలను ఆపసాగాడు. అదే సమయంలో ఓ కారు డ్రైవర్ వారిని గుర్తించి హుటాహుటిన పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. కాగా అప్పటికే మహేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన రాజు కోమాలోకి వెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మరో వారంలో జీవితంలో స్థిరపడే వారు..

మరో వారంలో మహేష్ ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు అంతా సిద్ధం చేసుకున్నాడు. చెన్నైలో వైద్య విద్యను పూర్తిచేసిన బత్తుల రాజు సైతం మరో వారం రోజుల్లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. చేతికందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో మహేష్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం స్వ గ్రామం వల్లాలలో మహేష్ అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పక్కా ప్రణాళికతోనే ప్రైవేట్ బస్సులో చోరీ

- రూ.28లక్షలు చోరీ చేసేందుకు ముందస్తుగానే ప్లాన్ చేసిన నిందితులు
- బస్సు కోసం ముందుగానే కారులో వచ్చి హోటల్ వద్ద ఎదురుచూపు
- చోరీ చేసిన నగదు బ్యాగులను మరో ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు తరలింపు
- హోటల్ వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ ముందు నిలిపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.28లక్షలు చోరీ చేసిన విషయం తెలిసిందే. అయితే పక్కా ప్రణాళికతోనే నిందితులు ఈ చోరీకి ప్లాన్ చేసినట్లు హోటల్ వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ద్వారా తెలుస్తోంది. వివరాలు.. హైదరాబాద్ శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని కృష్ణాకాలనీ చెందిన సుశాంత్‌కుమార్ పాండా తాను నిర్వహించే ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారంలో భాగంగా ఇటీవల ఒరిస్సా రాష్ట్రంలోని బరంపూర్ ప్రాంతానికి వెళ్లి తనకు రావాలస్సిన రూ.28లక్షలను వసూలు చేసుకొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో బుధవారం ఉదయం 8గంటల సమయంలో బస్సు డ్రైవర్ నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి సమీపంలో హైవే పక్కన గల పూజిత హోటల్ వద్ద టిఫిన్ కోసం బస్సును నిలిపాడు. డబ్బు ఉన్న రెండు బ్యాగులను బస్సులోనే తన సీట్లో ఉంచిన పాండా టిఫిన్ చేసేందుకు కిందకు దిగాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూసేసరికి డబ్బు ఉన్న బ్యాగులు కనిపించకపోవడంతో బస్సు డ్రైవర్, హోటల్ యజమాని సహకారంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని బస్సు డ్రైవర్, బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అందులో ప్రయాణిస్తున్న 27మందిని విచారించారు. హోటల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిందితుల దృశ్యాలు రికార్డయ్యాయని, వారిని పట్టుకునేందుకు 4టీంలతో గాలిస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు..

కాగా సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ప్రకారం.. బస్సు హోటల్ వద్దకు వచ్చే కంటే కొంచెం ముందే ఓ కారు అక్కడకు వచ్చింది. ఆ తర్వాత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హోటల్ వద్దకు రాగా.. అందులోని ప్రయాణికులు దిగిన తర్వాత కారులోని ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు బస్సులోకి వెళ్లి రెండు బ్యాగులను బయటకి తీసుకొచ్చి విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి రెండు బ్యాగులు ఇచ్చాడు. ఆ తర్వాత కారులో వచ్చిన వారు హైదరాబాద్ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది.

గతంలోనూ ఇలాంటి ఘటనలు..

→ పూజిత హోటల్ వద్దే గతంలోనూ ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి 130 తులాల బంగారం చోరీ జరిగింది. 22 నవంబర్, 2022న చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అల్పాహారం కోసం పూజిత హోటల్ వద్ద ఆపగా.. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి చొరబడి అందులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చెందిన 130 తులాల బంగారం చోరీ చేశారు.

→ అదేవిధంగా 4 జూలై, 2019న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి హైదారాబాద్ వెళ్తుండగా.. డ్రైవర్ పూజిత హోటల్ వద్ద అల్పాహారం కోసం ఆపాడు. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి వెళ్లి రూ.10లక్షల నగదు బ్యాగును చోరీ చేశారు. కాగా ఈ రెండు ఘటనల్లో పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. అప్పట్లో ఆ హోటల్ వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను ఇప్పటివరకు గుర్తించలేదని తెలుస్తోంది.

యాదాద్రిని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్


డిప్యూటీ హై కమిషనర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట : బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఒవెన్ గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి మొక్కను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు జిల్లాలో అమలవుతున్న తీరును హై కమిషనర్‌కు కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. అనంతరం బ్రిటీష్ హైకమిషనర్ గారెత్ విన్ ఒవెన్ యాదగిరిగుట్టకు వెళ్లి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.